తెలంగాణ పతక జోరు

నందినికి స్వర్ణం, నిత్య, నిశికకు కాంస్యాలు

మహిళల నెట్‌బాల్‌లో రజత పతకం • 38వ నేషనల్ గేమ్స్

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా జరుగుతున్న 38వ నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. మంగళవారం వేర్వేరు క్రీడా విభాగాల్లో తెలంగాణ ప్లేయర్లు నాలుగు పతకాలతో సత్తాచాటారు. మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో రాష్ట్ర స్టార్ అథ్లెట్ అగసర నందిని 5601 అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకంతో మెరిసింది. మొత్తం ఏడు ఈవెంట్లతో ప్రత్యర్థులకు దీటైన పోటీ నిస్తూ ముందుకు సాగిన నందిని నేషనల్ గేమ్స్‌లో రెండో పతకాన్ని ఖాతాలో వేసుకుంది. పూజ (4999, హర్యానా), దీపిక(4939, తమిళనాడు) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. మహిళల 200మీటర్ల రేసులో రాష్ట్రానికి చెందిన గాదె నిత్య 23.76 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సొంతం చేసుకుంది. ఇదే కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి యర్రాజీ (23.35సె), ఉన్నతి అయ్యప్ప (23.70సె, కర్నాటక) వరుసగా స్వర్ణ, రజత పతకాలు ఖాతాలో వేసుకున్నారు. నేషనల్ గేమ్స్‌లో జ్యోతికి ఇది రెండో స్వర్ణం కావడం విశేషం. మరోవైపు మహిళల జిమ్నాస్టిక్స్ ఆల్‌రౌండ్ వ్యక్తిగత విభాగంలో యువ జిమ్నాస్ట్ నిశిక అగర్వాల్ 44:767 స్కోరుతో కాంస్యం సొంతం చేసుకుంది. మహిళల నెట్‌బాల్ ఫాస్ట్5 ఫైనల్లో తెలంగాణ జట్టు 20-23తో హర్యానా చేతిలో ఓడి రజత విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా ఇప్పటి వరకు తెలంగాణ 2 స్వర్ణాలు, 3 రజతాలు, 8 కాంస్యాలతో 27వ స్థానంలో కొనసాగుతున్నది.

టార్గెట్ క్లీన్‌స్వీప్

చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఆఖరి సన్నాహకం • భారీ ఇన్నింగ్స్ బాకీపడ్డ కోహ్లీ

జోరు మీదున్న టీమ్‌ఇండియా • నేడు భారత్, ఇంగ్లండ్ మూడో వన్డే

అహ్మదాబాద్: సొంతగడ్డపై ఇంగ్లండ్‌ను టీ20లతో పాటు వన్డేలలోనూ మట్టికరిపించిన టీమ్‌ఇండియా.. బుధవారం వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరో వారం రోజుల్లో తెరలేవనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇరు జట్లకు ఇదే ఆఖరి సన్నాహక మ్యాచ్. ఈ నేపథ్యంలో లోపాలను సవరించుకోవడంతో పాటు కూర్పును సరిదిద్దుకునేందుకు రోహిత్ సేనకు ఇదే చివరి అవకాశం. అహ్మదాబాద్‌లో 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఓటమి తర్వాత భారత్ ఇక్కడ ఆడబోతున్న తొలి మ్యాచ్ ఇదే. రెండో వన్డేలో సారథి రోహిత్ శర్మ సెంచరీతో ఫామ్‌లోకి రాగా మరో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా తనకు అచ్చొచ్చిన స్టేడియంలో పుంజుకుంటే చాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్‌కు బెంగ తీరినట్టే. ఇక టీ20లతో పాటు వన్డే సిరీస్‌నూ కోల్పోయిన ఇంగ్లండ్.. మూడో వన్డేలో అయినా గెలిచి పరువు దక్కించుకోవాలని భావిస్తోంది.

ఆ ఒక్కడూ మెరిస్తే..

చాలాకాలం తర్వాత రోహిత్.. కటక్‌లో తనదైన రీతిలో చెలరేగి ఫామ్‌లోకి వచ్చాడు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇది అతడితో పాటు జట్టుకూ ధైర్యాన్నిచ్చేదే. టాపార్డర్‌లో గిల్, శ్రేయస్ నిలకడగా రాణిస్తుండగా ఐదో స్థానంలో వస్తున్న అక్షర్ పటేల్ సైతం రాణిస్తున్నాడు. కానీ రన్‌మిషీన్ కోహ్లీ మాత్రం భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. ఆస్ట్రేలియా సిరీస్‌తో పాటు రంజీలలో ఒక మ్యాచ్ ఆడి విఫలమైన కోహ్లీ.. కటక్‌లోనూ నిరాశపరిచాడు. అహ్మదాబాద్‌లో అతడు రాణించాలని టీమ్ ఇండియా ఆశిస్తోంది. కోహ్లీతో పాటు ఈ సిరీస్‌లో విఫలమవుతున్న వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్.. చివరి వన్డేలో ఫామ్‌ను అందుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే అహ్మదాబాద్‌లో పంత్‌ను ఆడిస్తే రాహుల్‌ను పక్కనబెడతారా? అన్నది ఆసక్తికరం. బౌలింగ్‌లో షమీ ఇంకా పూర్తి స్థాయిలో మునపటి లయను అందుకోకపోయినా ఇక్కడ పదుల సంఖ్యలో ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన అతడు సత్తా చాటాలని టీమ్‌మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది.

పరువు కోసం బట్లర్ సేన..

జట్టు నిండా మ్యాచ్ విన్నర్లు ఉన్నప్పటికీ వరుసగా రెండు సిరీస్‌లు కోల్పోయిన బట్లర్ సేన.. ఆఖరి మ్యాచ్‌లో అయినా గెలిచి పరువు నిలుపుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. తొలి వన్డేలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా కటక్‌లో ఆ జట్టు బ్యాటర్లు ఫర్వాలేదనిపించారు. డకెట్, సాల్ట్ దూకుడుతో శుభారంభాలు అందిస్తున్నా మిడిలార్డర్ దానిని సద్వినియోగం చేసుకోవడం లేదు. భారత స్పిన్నర్ల మాయ నుంచి ఇంగ్లీష్ బ్యాటర్లు తప్పించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా జడేజా స్పిన్ ఉచ్చులో ఇంగ్లండ్ విలవిల్లాడుతోంది. బ్యాటింగ్ వైఫల్యానికి తోడు ఆ జట్టు బౌలింగ్ కూడా నాసిరకంగా ఉంది. కటక్‌లో రోహిత్ బాదుడుకు ఆ జట్టు బౌలర్లు బలయ్యారు. బ్యాటింగ్‌కు అనుకూలించే అహ్మదాబాద్ పిచ్‌పై ఇంగ్లీష్ బౌలర్లు ఏ మేరకు రాణిస్తారనేది చూడాలి.

మ. 1:30 గం. నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో లైవ్

మరో 11 పరుగులు చేస్తే వన్డేలలో రోహిత్ 11 వేల మైలురాయిని అందుకుంటాడు.

బుమ్రా లేకుండానే..

చాంపియన్స్ ట్రోఫీకి భారత్

బెంగళూరు: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వెన్నునొప్పి గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకుని టీమ్ ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా..చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. మంగళవారం బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా..చాంపియన్స్ టోర్నీ కోసం 15 మందితో ప్రకటించిన జట్టులో బుమ్రా చోటు దక్కించుకోలేకపోయాడు. ప్రస్తుతం జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లో పునరావాసం పొందుతున్న ఈ పేసర్ గాయం నుంచి పూర్తిగా కోలుకోలేకపోయాడు. ఈ నేపథ్యంలో బుమ్రా స్థానంలో యువ పేసర్ హర్షిత్ రాణాకు అవకాశం కల్పించారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను తప్పిస్తూ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని జట్టుకు ఎంపిక చేశారు. బుమ్రాకు బదులు హైదరాబాదీ మహమ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేస్తారనుకున్నా..సెలెక్టర్ల నుంచి అతనికి నిరాశే ఎదురైంది. జైస్వాల్, దూబే జతగా సిరాజ్.. నాన్ ట్రావెలింగ్ రిజర్వ్‌గా ఎంపికయ్యాడు.

జట్టు వివరాలు:
రోహిత్‌శర్మ(కెప్టెన్), గిల్(వైస్ కెప్టెన్), కోహ్లీ, శ్రేయాస్, కేఎల్ రాహుల్(కీపర్), పంత్(కీపర్), హార్దిక్, అక్షర్, సుందర్, కుల్దీప్, రాణా, షమీ, అర్ష్‌దీప్‌సింగ్, జడేజా, చక్రవర్తి

క్రికెట్‌కు జాక్సన్ వీడ్కోలు

న్యూఢిల్లీ: దేశవాళీ దిగ్గజం షెల్డన్ జాక్సన్ ప్రొఫెషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన 15 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు సౌరాష్ట్ర స్టార్ బ్యాటర్ జాక్సన్ ఫుల్‌స్టాప్ పెట్టాడు. రంజీ ట్రోఫీలో గుజరాత్‌తో క్వార్టర్ ఫైనల్ తనకు ఆఖరిదని మంగళవారం ప్రకటించాడు. తన కెరీర్‌లో 105 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడిన 38 ఏండ్ల జాక్సన్ 7200 పరుగులు సాధించాడు. ఇందులో 21 సెంచరీలు, 39 అర్ధసెంచరీలు ఉన్నాయి.

సెమీస్‌కు ముంబై, విదర్భ

కోల్‌కతా: రంజీ ట్రోఫీ సీజన్ 2024-25లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై సెమీఫైనల్‌కు చేరింది. హర్యానాతో జరిగిన మూడో క్వార్టర్స్ మ్యాచ్‌లో ముంబై.. 152 పరుగుల తేడాతో ప్రత్యర్థిని చిత్తుచేసి సెమీస్‌కు అర్హత సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు సారథి రహానే (108) సెంచరీతో చెలరేగడంతో ముంబై 339 పరుగులకు ఆలౌట్ అయి హర్యానా ఎదుట 354 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో హర్యానా 201 రన్స్‌కే కుప్పకూలింది. రోయ్‌స్టన్ (5/39) ఐదు వికెట్లతో చెలరేగగా సీనియర్ పేసర్ శార్దూల్ ఠాకూర్ (3/26) రాణించాడు. తమిళనాడుతో జరిగిన రెండో క్వార్టర్స్ మ్యాచ్‌లో విదర్భ 198 పరుగుల తేడాతో గెలిచి సెమీస్‌లోకి ప్రవేశించింది. విదర్భ నిర్దేశించిన 401 పరుగుల ఛేదనలో తమిళనాడు 202 పరుగులకే ఆలౌట్ అయింది. సెమీస్‌లో విదర్భ.. ముంబైతో తలపడనుంది. నాలుగో క్వార్టర్స్ పోరులో సౌరాష్ట్రపై గుజరాత్ ఇన్నింగ్స్ 98 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. జమ్ముకశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో కేరళ.. 399 పరుగుల ఛేదనలో 100/2 స్కోరు చేసింది.

ఇదే ఒరవడి కొనసాగిస్తా: త్రిష

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇటీవల ముగిసిన ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో కనబరిచిన దూకుడునే భవిష్యత్‌లో కొనసాగిస్తానని తెలంగాణ యువ క్రికెటర్ గొంగడి త్రిష పేర్కొంది. టీ20 ప్రపంచకప్‌ను భారత్ గెలువడంలో కీలకంగా వ్యవహరించిన త్రిషను ఏఆర్‌కే గ్రూపు ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'కెరీర్ తొలి నాళ్లనుంచి నాకు ఏఆర్‌కే గ్రూపు మద్దతుగా నిలుస్తూ వస్తుంది. ప్రతీ సందర్భంలో వారు నాకు వెన్నంటి నిలిచారు. రానున్న రోజుల్లో దేశం గర్వపడేలా రాణించేందుకు మరింతగా కష్టపడుతాను' అని అంది. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ దిగ్గజం గోపీచంద్, మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్, ఏఆర్‌కే చైర్మన్ రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్ టైటాన్స్‌కు కొత్త ఓనర్

- మెజారిటీ వాటాలు కొన్న టొరెంట్ గ్రూప్

అహ్మదాబాద్: ఐపీఎల్ మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌కు వచ్చే సీజన్ నుంచి కొత్త యాజమాన్యం రానుంది. ప్రస్తుతం టైటాన్స్‌లో అత్యధిక వాటా కలిగిన సీవీసీ క్యాపిటల్స్ వద్ద ఉన్న 67 శాతం వాటాలను అహ్మదాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ టొరెంట్ గ్రూప్ కొన్నట్టు ఐపీఎల్ వర్గాల సమాచారం. ఇందుకు సంబంధించిన ఒప్పందం ఇరు వర్గాల మధ్య ఇప్పటికే పూర్తవగా ఐపీఎల్ పాలక మండలి దానికి ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. త్వరలో ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశమున్నట్టు తెలుస్తోంది. దీని ప్రకారం వచ్చే సీజన్‌లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ జట్టు కొత్త యాజమాన్యం మార్గదర్శకత్వంలో బరిలోకి దిగుతుంది. 2021లోనే టొరెంట్ గ్రూప్.. గుజరాత్ ఫ్రాంచైజీని దక్కించుకోవడానికి 2021లో బిడ్ కూడా వేసింది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లోనూ జట్టు కోసం యత్నించినా ఆ సంస్థకు అప్పుడు నిరాశే ఎదురైనా ఇప్పుడు ఐపీఎల్‌లో టైటాన్స్ ఓనర్స్ కానుంది.

R.V. TOURS AND TRAVELS PVT. LTD.

మన కరీంనగర్ లో

నూతన కార్యాలయం ప్రారంభోత్సవం

ప్రముఖ గాయని మధు ప్రియా గారి చే

అడ్రస్ : H.NO-7-1-36, 1st ఫ్లోర్, కోటక్ బ్యాంకు పైన, మంకమ్మ తోట, కరీంనగర్

తేదీ : 12.02.2025 సమయం : 10 AM

RV Travel Expo 2024 - 2025

డొమెస్టిక్ & ఇంటర్నేషనల్ టూర్స్ పై

భారీ డిస్కౌంట్స్ ఆఫర్స్

చివరి అవకాశం

12th-15th ఫిబ్రవరి 2025

కాశీ - అయోధ్య స్పెషల్ ఆఫర్ (ఫ్లైట్ ప్యాకేజ్) 3 N / 4 D Rs.21,999/- + 5% GST Per Person

కైలాస్ మానసరోవర్ యాత్ర స్పెషల్ ఆఫర్ (ఫ్లైట్ ప్యాకేజ్) 13 N / 14 D Rs.2,75,000/- + 5% GST Per Person

Contact:7032666921

బ్యాంకాక్ పట్టాయా స్పెషల్ ఆఫర్ (ఫ్లైట్ ప్యాకేజ్) 4 N / 5 D Rs.33,999/- + 5% GST Per Person

యూరోప్ స్పెషల్ ఆఫర్ (ఫ్లైట్ ప్యాకేజ్) 13 N / 14 D Rs.3,25,000/- + 5% GST + 5% TCS Per Person

మలేషియా స్పెషల్ ఆఫర్ (ఫ్లైట్ ప్యాకేజ్) 3 N / 4 D Rs.49,999/- + 5% GST + 5% TCS Per Person

* T&C Apply

చార్ధామ్ 11 N/12 D Rs.59,800/- 13 N/14 D Rs.67,500/- (ఫ్లైట్ ప్యాకేజ్)

12 N/13 D ముక్తినాథ్ (ఫ్లైట్ ప్యాకేజ్) Rs.75,900/-

13 N/14 D అమర్నాథ్ (ఫ్లైట్ ప్యాకేజ్) Rs.67,500/-

6 N/7 D కర్ణాటక (ఫ్లైట్ ప్యాకేజ్) Rs.47,500/-

11 N/12 D గుజరాత్ - మధ్య ప్రదేశ్ (ఫ్లైట్ ప్యాకేజ్) Rs.65,500/-

7 N/8 D మహారాష్ట్ర (బస్సు ప్యాకేజ్) Rs.44,000/-

5 N/6 D శ్రీలంక (ఫ్లైట్ ప్యాకేజ్) Rs.57,000/-

4 N/5 D దుబాయ్ (ఫ్లైట్ ప్యాకేజ్) Rs.97,500/-

15 N/16 D ఆస్ట్రేలియా - న్యూజిలాండ్ (ఫ్లైట్ ప్యాకేజ్) Rs.5,30,000/-

10 N/11 D కంబోడియా - వియత్నాం (ఫ్లైట్ ప్యాకేజ్) Rs.1,75,000/-

R V Ramana
Chairman & Founder

9154149938, 9177333673, 9154225669, 9121144001